## సాంబార్‌లో పడి బాలుడి మృతి

భీమ్‌గల్, ఫిబ్రవరి 26 : శుభకార్యానికి వెళ్లిన బాలుడు ఆడుకుంటూ వెళ్లి వేడి సాంబార్‌లో పడి మృతి చెందిన ఘటన భీమ్‌గల్‌లో చోటు చేసుకున్నది. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన కర్నే నిహారిక తన కుమారుడితో కలిసి తమ సమీప బంధువుల ఊరు ముచ్కూర్‌కు ఈనెల 19న వెళ్లింది. అక్కడ ఆమె కుమారుడు చార్విక్ (3) ఆడుకుంటూ వంటలు చేస్తున్న స్థలంలోకి వెళ్లాడు. ఒక్కసారిగా వేడి సాంబార్‌లో పడడంతో శరీరమంతా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాలుడిని చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి తల్లి నిహారిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## తాళం వేసిన మూడిండ్లలో చోరీ

**27 తులాల బంగారు నగలు, 12 తులాల వెండి, రూ. 60 వేల నగదు అపహరణ**

వినాయక్‌నగర్/ మాక్లూర్, ఫిబ్రవరి 26 : జిల్లాలోని మూడు ప్రాంతాల్లో తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసిన దుండగులు.. భారీ చోరీకి పాల్పడ్డారు. గూపన్‌పల్లి గ్రామపరిధితోపాటు ఏకశిలానగర్ కాలనీ, మాక్లూర్ మండలంలోని ఆర్టీసీ కాలనీలో చోరీలు జరిగాయి. రూరల్ ఎస్సై మహ్మద్ ఆరిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. గూపన్‌పల్లి గ్రామానికి చెందిన దుగ్గి బల్‌రాంరెడ్డి ఉదయం తాళం వేసి బయటికి వెళ్లాడు. దుండగులు ఇంటి తాళం ధ్వంసం చేసి, బీరువాలో ఉన్న 25 తులాల బంగారు నగలను దోచుకుపోయారు. అలాగే ఏకశిలానగర్ కాలనీలో నివాసం ఉండే దాకిపల్లి రవీందర్ ఇంటికి తాళం వేసి ఆలయానికి వెళ్లారు. దుండగులు డోరుకు ఉన్న గొళ్లెంను ధ్వంసం చేసి, ఇంట్లోకి చొరబడి, బీరువాలో ఉంచిన రూ.60 వేల నగదు దోచుకుపోయారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, క్లూస్‌టీమ్ తో ఆధారాలు సేకరించారు. చోరీలపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మాక్లూర్ మండలంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన రవి బుధవారం మహాశివరాత్రి సందర్భంగా రామచంద్రాపల్లి గ్రామశివారులోని కోటిలింగాల గుడికి కుటుంబంతో కలిసి వెళ్లినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మధ్యాహ్నం తిరిగి ఇంటికి వెళ్లి చూడగా ఇంటి తలుపులు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. 22 గ్రాముల బంగారం, 12 తులాల వెండి చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడి మృతి

కోటగిరి, ఫిబ్రవరి 26 : మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓల్లెపు రమేశ్ (30) హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కొత్తపల్లికి చెందిన రమేశ్ కొంతకాలంగా ఛాతి నొప్పితో బాధపడుతున్నాడు. బాధ భరించలేక ఈ నెల 21న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య ఓల్లెపు అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సందీప్ తెలిపారు.

# ఆలయాల్లో మార్మోగిన శివనామ స్మరణ



జక్రాన్‌పల్లి మండలం కలిగోట్ పుట్ట శివాలయంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



బోధన్ పట్టణంలోని చక్రేశ్వర ఆలయంలో భక్తుల సందడి

- **భక్తిశ్రద్ధలతో శివరాత్రి వేడుకలు**
- **కిటకిటలాడిన శైవక్షేత్రాలు**

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఫిబ్రవరి 26 : జిల్లాలో మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తులు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. హరహర మహాదేవ... శంభోశంకర... అంటూ భక్తులు గరళకంఠుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. జలాభిషేకంతోనే కరుణను కురిపించి వరాలు గుప్పించే భోళా శంకరుడికి భక్తులు బిల్వపత్రం, నమక చమక రుద్రాభిషేకాలు నిర్వహించారు. సూర్యోదయానికి ముందే అభ్యంగ స్నానాలు చేసి, ఆలయాల ముందు బారులు తీరారు. నగరంలోని నీలకంఠేశ్వరాలయం, శంభునిగుడి, ఉమామహేశ్వరాలయం, లింగేశ్వరగుట్ట, నందిగుట్ట తదితర ఆలయాలతోపాటు జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అర్ధరాత్రి లింగోద్భవం వేళ శివపార్వతుల కల్యాణ వేడుకలు అర్చకులు వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాటు చేశారు. భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టారు. ఆలయాల వద్ద భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం శివాలయ ప్రాంగణాల్లో అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు ఆలయ కమిటీల ప్రతినిధులు తెలిపారు.

## పండ్ల ధరలకు రెక్కలు

కోటగిరి, ఫిబ్రవరి 26 : మహాశివరాత్రి సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టారు. కేవలం ఫలాలు మాత్రమే స్వీకరించే ఆనవాయితీ ఉన్న నేపథ్యంలో వ్యాపారులు పండ్ల ధరలను ఒక్కసారిగా రెండింతలు చేశారు. రెండు రోజుల క్రితం డజన్ అరటి పండ్లు రూ. 30 ఉండగా.. వాటిని రూ. 60–రూ. 80 వరకు విక్రయించగా.. కొనుగోలుదారులు అవాక్కయ్యారు. అరటిపండ్లు రూ.80, యాపిల్ కిలో రూ.160–180, ద్రాక్ష రూ.150 ఇలా ఏ పండ్లు కొనుగోలు చేయాలనుకున్నా ధరలు విపరీతంగా పెంచారని కొనుగోలుదారులు వాపోయారు.



కోటగిరిలో పండ్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు



## రావి ఆకుపై శివుడి చిత్రం

*మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన కళాకారుడు రాము మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం రావి ఆకుపై శివుని చిత్రాన్ని చిత్రీకరించాడు. సిజేరియన్ బ్లేడ్‌తో కేవలం 20 నిమిషాల్లో చిత్రాన్ని చిత్రీకరించినట్లు చెప్పాడు.*

*–మోర్తాడ్, ఫిబ్రవరి 26*

## ఆలయాల్లో పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి దంపతులు



లింగేశ్వర గుట్టపై పూజలు చేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్ దంపతులు

సారంగాపూర్/ సిరికొండ/ కమ్మర్‌పల్లి (మోర్తాడ్), ఫిబ్రవరి 26 : రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ దంపతులు శివరాత్రి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రూరల్ మండలం మల్లారం గ్రామ శివారులో ఉన్న లింగేశ్వరగుట్ట ఆలయంలో ఆశ్రమ వ్యవస్థాపకుడు పిట్ల కృష్ణ మహరాజ్ ఆధ్వర్యంలో మాజీ జడ్పీటీసీ బొల్లెంక సుమలతా గోపాల్‌రెడ్డి, ఎంపీపీ అనూషా ప్రేమ్‌దాస్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మధుకర్‌రావుతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. సిరికొండ మండలంలోని రామలింగేశ్వరాలయంలో రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్మూర్ జూనియర్ సివిల్ జడ్జి దీప్తి వేముల, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సరళారాణి సైతం పూజలు చేశారు.

**చౌట్‌పల్లిలో పూజలు చేసిన రాజ్యసభసభ్యుడు సురేశ్‌రెడ్డి**

కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి గ్రామంలోని కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో రాజ్యసభసభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు.



కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న రాజ్యసభసభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి

## స్విమ్మింగ్‌పూల్‌లో నీట మునిగి యువకుడి దుర్మరణం



అశ్రఫ్ (ఫైల్)

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 26 : నిజామాబాద్ శివారులోని సారంగపూర్ పరిధిలో ఉన్న స్విమ్మింగ్‌పూల్‌లో బుధవారం సాయంత్రం ఈత కొట్టేందుకు దిగిన ఓ యువకుడు మృత్యువాతపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని నిజాంకాలనీకి చెందిన సయ్యద్ అశ్రఫ్ (22) తన అన్నతో కలిసి సారంగపూర్‌లోని జూమ్ స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లాడు. ఈత కొట్టేందుకు నీటిలోకి దిగిన యువకుడు.. అక్కడ కోచ్ లేకపోవడంతో మరింత లోతుకు వెళ్లి నీట మునిగి మరణించాడు. మృతుడి కుటుంబీకులు ఆరోటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న మైనార్టీ నాయకులు జిల్లా ప్రభుత్వ దవాఖానలోని మార్చురీలో ఉంచిన యువకుడి మృతదేహాన్ని పరిశీలించారు.

## గోదావరి నదిలో మునిగి మరో యువకుడు..

రెంజల్ (శక్కర్‌నగర్), ఫిబ్రవరి 26 : రెంజల్ మండలంలోని కందకుర్తి గోదావరి నదిలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గంగానదిలో స్నానానికి వచ్చిన ఓ యువకుడు నీటిలో మునిగి మృతి చెందాడు. రెంజల్ ఎస్సై తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్ మండలం బర్దీపూర్ గ్రామానికి చెందిన ఎ. వర్ధన్ (23) తన మిత్రుడు మేకల విఘ్నేశ్‌తో కలిసి బుధవారం ఉదయం కందకుర్తి గోదావరిలో స్నానానికి వెళ్లాడు. ఇద్దరూ స్నానం చేసేందుకు నీటిలోకి దిగగా.. వర్ధన్ గల్లంతుకావడంతో ఆందోళన చెందిన విఘ్నేశ్ విషయాన్ని కుటుంబీకులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. కుటుంబీకులు ఘటనాస్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో నీటిలో గాలింపు చర్యలు చేపట్టారు. వర్ధన్ నీటిలో మునిగి చనిపోగా, మృతదేహాన్ని ఈతగాల్లు బయటికి తీసుకువచ్చారు. మృతుడి తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు శవపంచనామా జరిపి, పోస్టుమార్టం నిమిత్తం బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రెంజల్ ఎస్సై తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు..



తాహిర్ (ఫైల్)

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 26 : నాలుగు రోజుల క్రితం అదృశ్యమైన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నగరంలోని మాలపల్లికి చెందిన తాహిర్ (26) ఈ నెల 22న ఐచర్ వాహనంలో సామాన్లు లోడ్ చేసుకొని వస్తానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లాడు. ఆ యువకుడు వాహనాన్ని మాలపల్లిలోని ఫ్రూట్ మార్కెట్ ఏరియాలో పార్క్ చేసి ఉన్నట్లు గుర్తించాడు. తిరిగి ఇంటికి రాకపోవడం, ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం రాత్రి తాహిర్ కుటుంబీకులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే సదరు యువకుడు జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన రోజే సాయంత్రం పూలాంగ్ ప్రాంతంలో అపస్మారక స్థితిలో ఉఉన్న తాహిర్‌ను స్థానికులు ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు సమాచారం.

## అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 26 : జిల్లా కేంద్రంలోని కోటగల్లీ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఎనిమిది రోజుల క్రితం అదృశ్యం కాగా.. నవీపేట్ మండలపరిధిలో మంగళవారం సాయంత్రం మృతదేహమై కనిపించాడు. ఫోర్త్ టౌన్ ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. కోటగల్లీకి చెందిన గుమ్మడి శ్రీనివాస్‌రెడ్డి (48) కారుడ్రైవర్‌గా పనిచేసేవాడు. సదరు వ్యక్తి ఈ నెల 15న కారుపై నిజామాబాద్ నుంచి కుంభమేళాకు వెళ్లి 17న రాత్రి నిజామాబాద్‌కు వచ్చాడు. నిజామాబాద్‌కు తిరిగి వచ్చిన రోజు నుంచి ఇంటికి రాకపోవడంతో అతడి కుటుంబీకులు వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఈనెల 24న నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 25న నవీపేట మండల పరిధిలోని గాంధీనగర్ గ్రామశివారులో ఓ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఆ మృతదేహం శ్రీనివాస్‌రెడ్డిదేనని గుర్తించారు. నాలుగు రోజుల నుచి గాంధీనగర్ గ్రామంలో బట్టలు లేకుండా పిచ్చివాడిలా తిరుగుతూ కనిపించినట్లు గ్రామస్తుల ద్వారా తెలిసిందని వెల్లడించారు. అతడికి మద్యం, కల్లు తాగడంతోపాటు కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు మృతుడి భార్య బుధవారం ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.


## ఇంటి వేలము ప్రకటన

**ది.నిజామాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బ్రాంచి: సిరికొండ, మం॥సిరికొండ, జి॥నిజామాబాద్**

**(యస్.సి.డి.ఆర్ / ఆఫీసర్ ఆన్‌స్పెషల్ డ్యూటీ ఎన్.డి.సి.సి. బ్యాంక్ లి., నిజామాబాద్ వారి ఉత్తర్వులననుసరించి)**

ఇందుమూలముగా తెలియపరుచునది ఏమనగా ది నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, బ్రాంచి సిరికొండ, మం॥సిరికొండ, జి॥నిజామాబాద్‌నకు బాకీ పడిన సొమ్ము మొత్తమును రాబట్టుటకు గాను ఈ దిగువ తెలిపిన తనఖా చేయబడిన ఇంటిని తెలంగాణ సహకార సంఘాల చట్టంలోని రూలు 52 ప్రకారము బహిరంగ వేలము ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది. కావున సదరు వేలములో పాల్గొనుటకు ఆసక్తిగలవారు ఈ దిగువ తెలుపబడిన షరతులు మరియు నిబంధనలకు లోబడి పాల్గొనగలరు.

| బాకీదారుని /తనఖాదారుని తండ్రి / భర్త పేరు | అమ్మబడు తనఖా వ్యవసాయ భూమి వివరాలు: ఇంటి నెం | విస్తీర్ణం | శివారు | వేలము తేది సమయం స్థలం | ఇ.పి.నెం.బాకీ బడిన సొమ్ము | వేలము నందు పాల్గొనుటకు ధరావత్తు సొమ్ము |
|---|---|---|---|---|---|---|
| శ్రీ సయ్యద్ వసీం (బాకీదారు) తండ్రి: సయ్యద్ ఇమామ్ గ్రా॥ సిరికొండ మం॥ సిరికొండ జి॥ నిజామాబాద్. | G.P.No. 2-121 | 218-66 Sq.Yards | రామడుగు | తేది: 28.02.2025 శుక్రవారము ఉ॥11-00 గం॥లకు రామడుగు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో | ఇ.పి.నెం. 1545/Com/2024-25 రూ॥7,61,925/- అదనంగా (+) వడ్డీ (+) అపరాధపు వడ్డీ (+) తదుపరి కిస్తులు ఉన్నచో వడ్డీతో సహా (+) జప్తు ఖర్చులు (+) ఇతర ఖర్చులు | రూ॥ 10,000/- |

**షరతులు మరియు నిబంధనలు**

1. పైన తెలుపబడిన తనఖా చేయబడిన ఇంటిని వేలము వేయుటకు అమ్మకపు అధికారికి పూర్తి అధికారము గలదు.
2. వేలము బహిరంగముగా జరుపబడును.
3. ప్రకటనలో తెలిపిన బాకీదారుని ఆస్తి ఏకమొత్తములో వేలము వేయుటకు సేల్ ఆఫీసర్ గారికి అధికారము కలదు.
4. వేలము సమయమునకు ముందుగా బకాయిదారులు గాని అతని ప్రతినిధి గాని బాకీ పడిన సొమ్ము చెల్లించిన యెడల వేలము వాయిదా వేయబడును లేదా రద్దు చేయబడును.
5. వేలము నందు పాల్గొనుటకు ఆసక్తి గలవారు ధరావత్తు సొమ్మును ముందుగా అమ్మకపు అధికారికి గాని సంఘ కార్యదర్శికి గాని డిడి లేదా నగదు రూపేణా స్వయంగా లేదా ప్రతినిధి ద్వారా చెల్లించి రశీదు పొందగలరు. సదరు వేలము వాయిదా బడిన లేదా రద్దు అయినచో సదరు వ్యక్తి ఏ కారణముచేనైనా వేలములో పాల్గొనుటకు ఇష్టపడని యెడల ఇట్టి ధరావత్తు సొమ్ము వాపసు చేయబడును.
6. ధరావత్తు సొమ్ము చెల్లించిన వారు మాత్రమే వేలములో పాల్గొనుటకు అర్హులు.
7. సదరు వేలమునందు అధిక ధర పాట పాడిన వారికి ఇంటిని (ఉన్నది ఉన్నట్లుగా) అప్పగించుటకు సేల్ ఆఫీసర్ గారికి అధికారము గలదు. వేలము తేది నుండి (30 రోజుల) తరువాత సేల్ సర్టిఫికేట్ ఇవ్వబడును.
8. సదరు వేలములో అధికముగా వేలం పాడిన వ్యక్తి వేలం పాటపాడిన కొనుగోలు సొమ్ము మొత్తములో 15శాతం సొమ్ము తక్షణమే డిపాజిట్ చేయవలెను. మిగతా సొమ్మును 15 రోజుల గడువు లోపుగా చెల్లించవలెను. గడువులోగా పూర్తి సొమ్మును కొనుగోలుదారు చెల్లించని యెడల 15% డిపాజిట్ సొమ్మును వేలం పాటదారుడు కోల్పోగలడు. మరియు అట్టి ఆస్తి తిరిగి వేలం వేయబడును. కొనుగోలుదారుడు అట్టి ఆస్తిని గాని అది అమ్మబడిన తరువాత ఏదేని భాగమునకు గాని అన్ని హక్కులను వదులుకొనవలెను. మొదటి కొనుగోలు దారుని రిస్కు మీద సదరు ఆస్తిని తిరిగి వేలము వేయబడును. తిరిగి వేలము వేయుటకు అగు ఖర్చును మొదటి కొనుగోలుదారు భరించవలెను.
9. స్టాంపు డ్యూటీ రిజిస్ట్రేషన్ మరియు ఇతర చార్జీలు కొనుగోలుదారుడే భరించవలెను.
10. వేలం పాట పాడిన ధర అనుచితముగా లేదా తక్కువగా ఉన్న యెడలగాని లేదా ఇతర కారణముల వలన గాని హెచ్చువేలం పాటను అమ్మకపు అధికారి తిరస్కరించవచ్చును.
11. డిక్రీ హోల్డర్ అయిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, సిరికొండ బ్రాంచి వేలములో పాల్గొనుటకు మరియు సెట్ ఆఫ్ చేసుకొనుటకు అర్హత కలదు.
12. వేలము నడపుటకు, ఖాయపరుచుటకు, వాయిదా వేయుటకు, రద్దు చేయుటకు అమ్మకపు అధికారికి పూర్తి స్వేచ్ఛ కలదు.
13. ఇంటి నెంబరు మరియు విస్తీర్ణము మొ॥ వివరముల యందు ఒకవేళ తప్పులు ఉన్నచో దానికి ప్రభుత్వము బాధ్యత వహించదని గమనించగలరు.

**తేది: 01-02-2025**
**నిజామాబాద్.**

**సం/- సహాయ జనరల్ మేనేజర్ / అమ్మకపు అధికారి**
**ది.నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి., నిజామాబాద్**


# పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలి

- **పోలింగ్ కేంద్రాల వద్ద ఇబ్బందులకు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి**
- **అదనపు కలెక్టర్ అంకిత్ సూచన**



బోధన్‌లో అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అంకిత్



కమ్మర్‌పల్లికి చేరుకున్న పోలింగ్‌సిబ్బంది

బోధన్/మోర్తాడ్/వేల్పూర్/ఆర్మూర్‌టౌన్/మాక్లూర్/ఎడపల్లి/కోటగిరి, ఫిబ్రవరి 26: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఈనెల 27న నిర్వహించే పోలింగ్‌ను ప్రశాంతంగా జరిపించాలని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అంకిత్ సూచించారు. బుధవారం బోధన్ పట్టణం లోని పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం, పోలింగ్ కేంద్రాలను ఆయన సబ్ కలెక్టర్ వికాస్ మహతోతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న పీవోలు, ఏపీవోలకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పూర్తి సామగ్రి పంపిణీ చేయాలని, మరోమారు పరిశీలించుకోవాలన్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్‌శాఖ వారికి ఆదేశించాలని సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ విఠల్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఏర్గట్లలో ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కమ్మర్‌పల్లి మండలంలో 1021 గ్రాడ్యుయేట్, 61 టీచర్ ఓటర్లు, మోర్తాడ్ మండలంలో 671 గ్రాడ్యుయేట్, 61 టీచర్ ఓటర్లు, ఏర్గట్ల మండలంలో 304 గ్రాడ్యుయేట్ 17 మంది టీచర్ ఓటర్లు ఉన్నారు. ఎన్నికలకు ఆయా మండలాల తహసీల్దార్లు ఏర్పాట్లు పూర్తి చేయగా బుధవారం ఎన్నికల సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. వేల్పూర్ మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సంతోష్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి వసతి, ఓటు హక్కును వినియోగించడానికి వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తహసీల్దార్ తెలిపారు.

ఆర్మూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆర్డీవో రాజాగౌడ్ ఎన్నికల సామగ్రిని అధికారులు, సిబ్బందికి అందజేశారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. మాక్లూర్ మండలం మాదాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందని జోనల్ అధికారి, తహసీల్దార్ ఆకుల శేఖర్ తెలిపారు.

ఎడపల్లి మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎడపల్లి తహసీల్దార్ కె.ధన్వాల్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు కోటగిరి మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. కోటగిరి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది సామగ్రితో చేరుకున్నారని, ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

## బోధన్‌లో పారిశుద్ధ్య వాహనాల తనిఖీ

- **సిబ్బందికి సూచనలు చేసిన అదనపు కలెక్టర్ అంకిత్**

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 26: బోధన్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అంకిత్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పారిశుద్ధ్యానికి వినియోగించే వాహనాలు, మున్సిపల్ కార్యాలయంలోని స్వీపింగ్ మిషన్‌ను పరిశీలించారు. పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలని కమిషనర్ వెంకటనారాయణను ఆదేశించారు. ప్రస్తుతం వినియోగిస్తున్న వాహనాల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ప్రతి వాహన కండిషన్ వివరాలను ఈనెల 27వ తేదీలోగా తనకు సమర్పించాలని ఆదేశించారు. పట్టణంలో ఎక్కడా పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సిబ్బంది ఉన్నారు.



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్

## బెల్టుషాపులపై దాడి

**మద్యం సీజ్**

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 26: మండలంలోని ఊట్‌పల్లి, అమ్దాపూర్ గ్రామాల్లోని రెండు బెల్టుషాపుల్లో బోధన్ రూరల్ పోలీసులు దాడి జరిపారు. ఈనెల 25న రాత్రి మద్యం విక్రయిస్తున్నారని అందిన సమాచారం మేరకు దాడి చేసి ఊట్‌పల్లిలో 4 లీటర్లు, అమ్దాపూర్‌లో 10 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు రూరల్ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు. మద్యం విక్రయిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు.

## టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా తాజుద్దీన్

మోర్తాడ్, ఫిబ్రవరి 26 : నిజామాబాద్ టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా తాజుద్దీన్‌ను నియమిస్తూ భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఏడాది జూలై వరకు తాజుద్దీన్ ఈ పదవి లో కొనసాగనున్నారు. ఈయన మాక్లూర్ మండల బీఆర్‌ఎస్ మైనారిటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా తన నియామకానికి సహకరించిన రాజ్యసభసభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డిని కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.



రాజ్యసభసభ్యుడు సురేశ్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న తాజుద్దీన్

## గుడిసె దగ్ధం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి 26: ఆర్మూర్ పట్టణంలోని మల్లారెడ్డి చెరువు సమీపంలో బుధవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు పరిపూర్ణం అనే వ్యక్తికి చెందిన గుడిసెకు నిప్పు పెట్టారు. దీంతో పరిపూర్ణం నూతన గృహ నిర్మాణానికి తెచ్చుకున్న తలుపులు, కిటికీలతో పాటు ఇతర సామగ్రి దగ్ధమైంది. సుమారు 3 లక్షల రూపాయల వరకు నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.



దగ్ధమైన గుడిసె


**నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్**

**CHANGE OF NAME**

★I, **CHEPUR SRIDHAR GOUD** (Old-Name) S/o CHEPURI SUDHARSHAN GOUD ,R/o .H.No.3-67 , Gouds Colony Ravutla,Vil ,Sirikonda,Mdl, Nizamabad ,Dist., T.S., My Passport No. **M2933302** have Changed my Surname / name as **CHEPURI SRIDHAR GOUD** (New Surname/name)

**NTZ-338519**

**CHANGE OF NAME**

★I, **CHEPUR CHANDRAKALA** (Old Name) W/o ,CHEPURI SRIDHAR GOUD R/o .H.No.3-67, Gouds Colony, Ravutla,Vil Sirikonda, Mdl, Nizamabad Dist., T.S., My Husband Passport No. **M2933302** Have Changed my Surname /name as **CHEPURI CHANDHRAKALA** (New Surname/name)

**NTZ-338519**

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
" పేరు మార్పిడి " ప్రకటన
4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్ : 91827 77590

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.